మృగం కాదు.. మోడు!

మంచిర్యాల జిల్లా హాజీపూర్ మండలం ఎల్లంపల్లి ప్రాజెక్టులో గుడిపేట, నంనూరు గ్రామాలు మునిగిపోయాయి. ప్రస్తుతం వర్షాభావ పరిస్థితుల్లో ప్రాజెక్టులో నీరు ఎండిపోగా ఆ గ్రామాల్లో ఇండ్లు, చెట్లు బయటపడ్డాయి. ఇదే సమయంలో గతంలో కొట్టి పడేసిన ఓ భారీ వృక్షం దూరం నుంచి చూస్తే అచ్చం మృగంలా కనిపిస్తున్నది. – స్టాఫ్ ఫొటోగ్రాఫర్, మంచిర్యాల

'తెల్లగొంతు బుచ్చిగాడు'

నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ మండలం చెర్కూర్‌లో వింత పక్షి బుధవారం కనువిందు చేసింది. అల్లె శ్రీరాములు పొలంలో ఉన్న నీటి తొట్టిలో పక్షి పడిపోగా.. రైతు సందీప్ బయటకు తీయగా ఆకాశంలోకి ఎగిరింది. ఈ పక్షి పేరు 'తెల్లగొంతు బుచ్చిగాడు. శాస్త్రీయ నామం హ్యాల్సియాన్ స్మర్ధిన్సిస్. కింగ్‌ఫిషర్ జాతికి సంబంధించినది. బల్లులు, తొండలు, ఎలుకలు, పీతలు తింటుంది' అని జడ్చర్ల బీఆర్ఆర్ డిగ్రీ కళాశాల వృక్షశాస్త్ర సహాయాచార్యుడు డాక్టర్ సదాశివయ్య తెలిపారు.

–వెల్దండ

ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ గురువారెడ్డి

మోకాలి మార్పిడి లేకుండానే శస్త్ర చికిత్స

- ఎపీసీలర్ రీసర్ఫేసింగ్‌తో వైద్యం
- కిమ్స్ సన్‌షైన్‌లో విజయవంతం

బేగంపేట, జూలై 3 : మోకాలి కార్టిలేజ్ గాయాలతో బాధపడుతున్న వారికి ఎపీసీలర్ జాయింట్ రీసర్ఫేసింగ్ శస్త్రచికిత్స ద్వారా నయం చేయవచ్చని బేగంపేట కిమ్స్ సన్‌షైన్ ఆస్పత్రి ఎండీ డాక్టర్ గురువారెడ్డి తెలిపారు. మోకాలి మార్పిడి చేయకుండానే దెబ్బతిన్న కార్టిలేజ్ భాగాన్ని అమర్చే ఆధునిక టెక్నాలజీ అందుబాటులోకి వచ్చిందని చెప్పారు. బుధవారం ఆస్పత్రిలో సర్జరీ విభాగం వైద్యుడు కుశాల్‌తో కలిసి ఆయన మాట్లాడారు. ఈ విధానంలో కిమ్స్ సన్‌షైన్ ఆస్పత్రిలో 40 ఏండ్ల వ్యక్తికి తెలుగు రాష్ట్రాల్లోనే మొదటి సారిగా శస్త్ర చికిత్సను విజయవంతంగా నిర్వహించినట్లు తెలిపారు. మోకాలులో దెబ్బతిన్న కార్టిలేజ్ సైజ్‌ను సీటీ స్కాన్ ద్వారా 3డీ ఇమేజ్ తీసి స్వీడన్‌కు పంపినట్టు వెల్లడించారు. అక్కడ ప్రత్యేకంగా తయారు చేసిన ఇంప్లాంట్ సాయంతో రోగికి దెబ్బతిన్న భాగంలో కార్డిలేజ్ అమర్చినట్లు తెలిపారు.

పోలవరంలో ముగిసిన విదేశీ నిపుణుల పర్యటన

త్వరలో ప్రభుత్వానికి నివేదిక

హైదరాబాద్, జూలై 3 (నమస్తే తెలంగాణ): పోలవరంలో విదేశీ నిపుణుల బృందం పర్యటన ముగిసింది. పోలవరం ప్రాజెక్టు సమస్యలపై అధ్యయనం చేసేందుకు 4 రోజులపాటు ఆ ప్రాంతంలో పర్యటించిన ఈ బృందం.. తొలిరోజు అప్పర్ కాఫర్ డ్యామ్, లోయర్ కాఫర్ డ్యామ్, స్పిల్‌వేలను, రెండోరోజు డయాఫ్రం వాల్, ఈసీఆర్ఎఫ్ డ్యామ్ నిర్మాణ ప్రాంతాలను పరిశీలించింది. డయాఫ్రం వాల్‌పై అనుమానం వచ్చిన ప్రతిచోటా కాంక్రీట్, మట్టి నమూనాలు సేకరించింది. అనంతరం కేంద్ర, రాష్ట్ర అధికారులకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చింది. బంకమట్టిపై ఎక్కడైనా నిర్మాణాలు చేపట్టాల్సి వస్తే అవి పటిష్ఠంగా ఉంటాయా? లేదా? అన్నదానిపై స్పష్టత ఇచ్చింది. అలాంటి ప్రాంతాల్లో నిర్మాణాలకు కూడా ఢోకా ఉండదని తెలిపింది. అమెరికాకు చెందిన జియాన్ ఫ్రాంకో డీ సిక్కో, డేవిడ్ బీ పాల్, కెనడాకు చెందిన సీన్ హించ్ బర్గర్, రిచర్డ్ డోనెల్లీతో కూడిన ఈ బృందాన్ని చివరి రోజు స్థానిక రైతులు కలిసి పోలవరం ప్రాజెక్టు ఆవశ్యకతను వివరించారు. సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణ అంశాల్లో నిపుణులైన ఈ నలుగురు పోలవరం ప్రాజెక్టుకు సంబంధించిన క్షేత్రస్థాయి వాస్తవ పరిస్థితులపై త్వరలో ప్రభుత్వానికి నివేదిక సమర్పించనున్నారు.

గంజాయి సమాచారమిస్తే 2 లక్షల నజరానా

హైదరాబాద్, జూలై 3 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో డ్రగ్స్, గంజాయిపై ఉక్కుపాదం మోపుతున్న తెలంగాణ నార్కోటిక్స్ విభాగం కీలక నిర్ణయం తీసుకున్నది. 100 కిలోల కంటే ఎక్కువ గంజాయి స్మగ్లింగ్ గురించిన సమాచారం ఇచ్చిన వారికి రూ.2 లక్షల నగదు బహుమతి ఇస్తామని బుధవారం నార్కోటిక్స్ పోలీస్ అధికారులు ప్రకటించారు. సమాచారం ఇవ్వాలనుకున్న వాళ్లు 8712671111 నంబన్‌కు ఫోన్ చేయాలని సూచించారు.

పదోన్నతులకు 45 ఏండ్ల నిబంధనను తొలగించండి

హైదరాబాద్, జూలై 3 (నమస్తే తెలంగాణ): అంగన్‌వాడీ ఉద్యోగులకు వయసుతో నిమిత్తం లేకుండా పదోన్నతులు కల్పించాలని టీఎన్జీవో, టీజీవో నేతలు ప్రభుత్వాన్ని కోరారు. టీఎన్జీవో, టీజీవో ప్రతినిధులు బుధవారం సచివాలయంలో మంత్రి సీతక్కను కలిసి వినతిపత్రం సమర్పించారు. 45 ఏండ్ల నిబంధనను తొలగించి అంగన్‌వాడీలకు పదోన్నతులు కల్పించాలని నేతలు కోరారు. వినతిపత్రం సమర్పించిన వారిలో టీఎన్జీవో కేంద్రం సంఘం అధ్యక్షుడు మారం జగదీశ్వర్, టీజీవో అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాస్‌రావు, ప్రధాన కార్యదర్శి ముజీబ్ హుస్సేనీ, అసోసియేట్ అధ్యక్షుడు కస్తూరి వెంకటేశ్వర్లు, ముత్యాల సత్యనారాయణగౌడ్, పర్వతాలు, హరికృష్ణ, నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు కిషన్, కార్యదర్శి శేఖర్ తదితరులు ఉన్నారు.

ఇంకెన్నాళ్లో వేతన వెతలు?

- టీవీవీపీని డీఎస్‌హెచ్‌గా మార్చాలని డిమాండ్
- 010 పద్దు కింద ఒకటో తారీఖు జీతాలకు దూరం
- చివరి దశకు తీసుకొచ్చిన బీఆర్ఎస్ ప్రభుత్వం
- ఆరు నెలలుగా హామీలే తప్ప అమలేది?

హైదరాబాద్, జూలై 3 (నమస్తే తెలంగాణ): తెలంగాణ వైద్య విధాన పరిషత్తు (టీవీవీపీ)నుడైరెక్టరేట్ ఆఫ్ సెకండరీ హెల్త్ (డీఎస్‌హెచ్)గా మార్చే నిర్ణయం కోసం సిబ్బంది కండ్లు కాయలు కాసేలా ఎదురుచూస్తున్నారు. ఆరు నెలలుగా తిరుగుతున్నా వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహా ప్రతిసారి 'త్వరలో' అంటూ హామీ ఇస్తున్నారే తప్ప అమలు కావడం లేదని వాపోతున్నారు. వైద్య విధాన పరిషత్తును టీడీపీ ప్రభుత్వం 1987లో ఏర్పాటు చేసింది. ఇది ప్రభుత్వ సంస్థగా కాకుండా.. ప్రభుత్వ గ్రాంట్‌తో నడిచే సంస్థగా ఏర్పాటు చేసింది. పేస్కేలు, ఇతర ప్రయోజనాలన్నీ వైద్యారోగ్య శాఖలోని ఇతర ఉద్యోగులతో సమానంగా అమలవుతున్నా, జీతాలు మాత్రం ప్రభుత్వం గ్రాంట్ విడుదల చేసిన తర్వాతే వేస్తున్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు ట్రెజరీ ద్వారా 010 పద్దు కింద జీతాలు అందుతాయని, కానీ తాము ప్రతి నెల జీతభత్యాలకు నిధులు విడుదల చేయాలని ప్రభుత్వాన్ని బతిమాలుకోవాల్సి వస్తున్నదని వాపోతున్నారు. గ్రాంట్ విడుదల చేసిన తర్వాతనే వేతనాలు వస్తున్నాయని, మిగతా ఉద్యోగుల కన్నా రెండు వారాలు ఆలస్యంగా అందుతున్నాయని వాపోతున్నారు. తమను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, 010 పద్దు కింద జీతాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు.

కమిటీ నివేదిక ఇచ్చినా..

టీవీవీపీని డీఎస్‌హెచ్‌గా మార్చే ప్రక్రియను బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రారంభించి.. తుది దశకు తీసుకొచ్చింది. నిరుడు సెప్టెంబర్ 22న ప్రత్యేకంగా కమిటీని నియమించింది. డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ జనరల్ చైర్మన్‌గా, డీఎంఈ, డీపీహెచ్, టీవీవీపీ కమిషనర్ సభ్యులుగా ఉన్నారు. ఈ కమిటీ ఏపీలో ఏపీ వీవీపీని డీసీహెచ్‌గా ఎలా మార్చారో అధ్యయనం చేసింది. ఇతర రాష్ట్రాల్లోని విధానాలను పరిశీలించింది. టీవీవీపీని డీసీహెచ్‌గా మార్చేందుకు సూచనలు చేస్తూ డిసెంబర్‌లోనే ప్రభుత్వానికి నివేదిక అందజేసింది. కమిటీ నివేదిక ఇచ్చి ఆరు నెలలు గడిచినా ప్రభుత్వం కాలయాపన చేస్తున్నదని ఉద్యోగులు వాపోతున్నారు. టీవీవీపీని డీఎస్‌హెచ్‌గా మార్చితే ప్రభుత్వంపై రూపాయి కూడా అదనపు భారం పడదని ఉద్యోగులు చెప్తున్నారు. ఇప్పుడు ఉన్న సిబ్బందితోనే ఎస్‌డీహెచ్ పరిపాలన సాగుతుందని, టీవీవీపీకి కమిషనర్ స్థానంలో డీఎస్‌హెచ్ డైరెక్టర్ వస్తారని అంటున్నారు. జీతభత్యాలు మారవని, తోటమాలి, ఫోన్ ఆపరేటర్ వంటి పోస్టులను తొలిగించుకునే అవకాశం ఉంటుందని చెప్తున్నారు. డీసీహెచ్ ఏర్పాటు చేస్తూ ఆర్డినెన్స్ జారీ చేయాలని, అసెంబ్లీలో బిల్లు పెట్టి తమను ప్రభుత్వ ఉద్యోగులగా మార్చాలని కోరుతున్నారు.

అమరావతిపై సీఎం శ్వేతపత్రం విడుదల

హైదరాబాద్, జూలై 3 (నమస్తే తెలంగాణ): ప్రపంచంలోనే అతి పెద్ద భూసేకరణ ప్రాజెక్టు అమరావతి అని ఏపీ సీఎం చంద్రబాబునాయుడు తెలిపారు. సచివాలయంలో మీడియా సమావేశంలో రాజధాని అమరావతిపై శ్వేతపత్రం విడుదల చేశారు. ప్రతి తెలుగు బిడ్డ అమరావతి నాది అని గర్వంగా గుర్తించాలని చెప్పారు. కొత్త ప్రణాళికలు లేవని, వాటినే కొనసాగిస్తూ నిర్మిస్తామని స్పష్టంచేశారు.

ఇద్దరు ఎఫ్ఆర్‌వోలపై సస్పెన్షన్ వేటు

వికారాబాద్, జూలై 3 (నమస్తే తెలంగాణ): తునికాకు బోనస్ స్వాహా విషయంలో వికారాబాద్, తాండూరు ఎఫ్ఆర్‌వోలను సస్పెండ్ చేస్తూ బుధవారం సీసీఎఫ్ ఉత్తర్వులు జారీ చేశారు. 2017లో తునికాకుకు సంబంధించిన బోనస్ 2024 మేలో అటవీ శాఖ జమ చేసింది. రూ.10 లక్షల వరకు వచ్చిన బోనస్‌ను తునికాకు రైతుల ఖాతాల్లో జమ చేయకుండా, తమకు సంబంధించిన వారి బ్యాంకు ఖాతాల్లో జమచేసుకోవడంతో వికారాబాద్, తాండూరు ఎఫ్ఆర్‌వోలు అరుణ, శ్యాంసుందర్‌పై ఉన్నతాధికారులు విచారణ చేపట్టారు. బోనస్ దుర్వినియోగంపై కంప్యూటర్ ఆపరేటర్‌ను విధుల నుంచి తొలగించిన విషయం తెలిసిందే.

రెండో వారంలో భారీ వర్షాలు

- నేటి నుంచి ఐదురోజులు మోస్తరు వానలు

హైదరాబాద్, జూలై 3 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో రైతులకు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు చల్లని కబురు చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా ఉపరితలగాలులు వీస్తున్నాయని, గురువారం నుంచి ఐదు రోజుల పాటు తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్టు వెల్లడించారు. దక్షిణ తెలంగాణ జిల్లాలైన మహబూబ్‌నగర్, నారాయణపేట, జోగులాంబ-గద్వాల, నల్గొండ, యాదాద్రి-భువనగిరి, వికారాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, నిర్మల్, జగిత్యాల, మెదక్, సంగారెడ్డి జిల్లాల్లో వర్షాలు కురుస్తాయని, ఆయా జిల్లాలకు ఎల్లోఅలర్ట్ జారీ చేశారు. హైదరాబాద్‌లో పొడి వాతావరణం ఉంటుందని, ఉత్తర తెలంగాణ జిల్లాల్లో చిరుజల్లులు కురుస్తాయని చెప్పారు. వర్షంతో పాటు గంటకు 30-40 కి.మీ వేగంతో భారీగా ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని తెలిపారు. ఉరుములు,మెరుపులతో పాటు పిడుగులు పడొచ్చునని, ప్రజలు అవసరమైతేనే ఇళ్ల నుంచి బయటకు రావాలని హెచ్చరించారు. జూలై 6 తర్వాత రుతుపవనాలు మరింత చురుకుగా కదులుతాయని, జూలై 2వ వారంలో ఈశాన్య తెలంగాణలో భారీ వర్షాలు కురుస్తాయని చెప్పారు. బుధవారం ములుగు జిల్లా తాడ్వాయిలో అత్యధికంగా 7.13 సెం.మీ వర్షపాతం నమోదైంది.

అంతర్జాతీయ స్థాయి ఆవిష్కరణలే లక్ష్యం

- మంత్రి శ్రీధర్‌బాబు
- టీకన్సల్ట్ సేవలు ప్రారంభం

హైదరాబాద్ సిటీబ్యూరో, జూలై 3 (నమస్తే తెలంగాణ): స్టార్టప్‌లను విశ్వవ్యాప్తం చేసేందుకు అవసరమయ్యే సలహాలు, సూచనలు, ప్రోత్సాహం, నిధుల మద్దతు అందేలా టీ కన్సల్ట్ సేవలు ఉపయోగపడుతాయని ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. టీ కన్సల్ట్‌తో తెలంగాణ స్టార్టప్‌లు అంతర్జాతీయ రంగంలోని అవకాశాలు సొంతం చేసుకోగలవని ధీమా వ్యక్తంచేశారు. టీ హబ్ కార్యాలయంలో శ్రీధర్‌బాబు బుధవారం టీకన్సల్ట్ సేవలను ప్రారంభించారు. టీకన్సల్ట్ బృందానికి మంత్రి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీకన్సల్ట్ చీఫ్ సందీప్‌కుమార్ మాక్తాల, నిర్మాత, స్టార్టప్ ఇన్వెస్టర్ దిల్ రాజు, టీ హబ్ చైర్మన్ ఎం శ్రీనివాస్‌రావు, డబ్ల్యూటీఐటీసీ ఎన్ఆర్ఐ సెక్రటరీ కిశోర్ పుల్లూరి, రావులపాటి రాజీవ్ పాల్గొన్నారు.



ఇది రుణ భారతం

న్యూఢిల్లీ, జూలై 3: భారత్.. అధిక రుణ భారాన్ని ఎదుర్కొంటున్నదని ఎన్‌సీఏఈఆర్ డైరెక్టర్ జనరల్ పూనమ్ గుప్తా అన్నారు. దేశ జీడీపీలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అప్పులు దాదాపు 82 శాతంగా ఉన్నట్టు చెప్పారు. అయితే చాలావరకు రుణాలు స్థానిక కరెన్సీ అయిన రూపాయల్లోనే ఉండటం, దేశ వృద్ధి రేటు కూడా ఆకర్షణీయంగా ఉన్న కారణంగా ఇప్పటికైతే ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఎన్‌సీఏఈఆర్ నిర్వహించిన ఓ కార్యక్రమంలో గుప్తా మాట్లాడుతూ.. మొత్తం అప్పుల్లో మూడింటా ఒక వంతు రాష్ట్రాలవని చెప్పారు. రాబోయే ఐదేండ్లలో రుణ భారం మరింతగా పెరిగేందుకు వీలుందన్నారు. అయినప్పటికీ కేంద్ర ప్రభుత్వ హామీ ఉండటం వల్ల రాష్ట్రాలపై పెద్దగా ప్రభావం పడకపోవచ్చన్నారు.

ఎన్నికల హామీలతో..

సాధ్యం కాని హామీలతో అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచి అధికారంలోకి వస్తున్న వివిధ పార్టీల వల్లే రాష్ట్రాల అప్పులు ఇంతలా పెరుగుతూపోతున్నాయని తక్షశిల ఇన్‌స్టిట్యూషన్ కౌన్సిలర్ ఎం గోవింద రావు ఈ సందర్భంగా అభిప్రాయపడటం గమనార్హం. గత ఏడాది ఆఖర్లో జరిగిన తెలంగాణ అసెంబ్లీ ఎలక్షన్లలో కాంగ్రెస్ పార్టీ సైతం పెద్ద ఎత్తున సబ్సిడీలు, సంక్షేమ పథకాలు, రుణ మాఫీ హామీలతోనే అధికారంలోకి వచ్చినది తెలిసిందే. ముందుగా చెప్పినట్టుగా ఈ హామీల అమలుకు ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం అనేక ఇబ్బందులను ఎదుర్కొంటుండగా.. తీవ్రంగా వేధిస్తున్న నిధుల కొరతనూ చూస్తూనే ఉన్నాం. ఈ నేపథ్యంలో ఎన్‌సీఏఈఆర్ చర్చలో పాల్గొన్న గోవింద రావు వ్యాఖ్యలు అత్యంత ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. ఇదిలావుంటే 2022-23 నాటికి పంజాబ్, హిమాచల్‌ప్రదేశ్, బీహార్ రాష్ట్రాల అప్పులే మిగతా రాష్ట్రాలకన్నా ఎక్కువగా ఉన్నాయి. అయితే మున్ముందు ఈ జాబితాలో దక్షిణాది రాష్ట్రాల పేర్లూ ఉంటాయన్న అంచనాలు వస్తుండటం గమనార్హం.

10 లక్షల కోట్లకు దేశీయ ఆహార మార్కెట్

2030 నాటికి చేరుతుందని అంచనాలు

న్యూఢిల్లీ, జూలై 3: దేశీయ ఆహార సేవల పరిశ్రమ అంచనాలకుమించి రాణిస్తున్నది. 2030 నాటికి ఈ రంగం రూ.10 లక్షల కోట్లకు చేరుకుంటుందని బెయిన్ అండ్ కంపెనీ, స్విగ్గీ సంయుక్తంగా 'హౌ ఇండియా ఈట్స్' పేరుతో విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది. అలాగే కస్టమర్లు 45 కోట్లకు చేరుకోనున్నట్లు తెలిపింది. ప్రస్తుతం రూ.5.5 లక్షల కోట్ల స్థాయిలో ఉన్నది. వచ్చే ఏడేండ్లలో ప్రతియేటా 10-12 శాతం మధ్యలో వృద్ధిని నమోదు చేసుకుంటుందన్న సర్వే.. 2030 నాటికి రూ.9 లక్షల కోట్ల నుంచి రూ.10 లక్షల కోట్లకు చేరుకుంటుందని వెల్లడించింది.

- ఆన్‌లైన్ ఫుడ్ డెలివరీ విభాగం ప్రతియేటా 18 శాతం వృద్ధిని నమోదు చేసుకోనున్నది.
- 2023లో 12 శాతంగా ఉన్న విని మయం 2030 నాటికి 30 శాతానికి చేరుకుంటుందన్న అంచనా.
- భారత్‌లో కంటే చైనాలో నాలుగు రెట్లు అధికంగా రెస్టారెంట్లు ఉన్నాయి.
- ప్రస్తుతం 32-34 కోట్లుగా ఉన్న ఆహార సేవల మార్కెట్ కస్టమర్లు..వచ్చే ఆరేండ్లలో మరో 11 కోట్లు పెరిగి 43 నుంచి 45 కోట్లకు పెరగనున్నారు.
- దేశవ్యాప్తంగా 50 నగరాల నుంచి సేకరించిన సమాచారం ఆధారంగా ఈ సర్వేను రూపొందించింది.

ఇక పెద్దగా లాభాలుండవ్

దేశీయ స్టాక్ మార్కెట్లపై ఫ్రాంక్లిన్ టెంపుల్టన్ ఎంఫ్ అంచనా

రాబోయే మూడేండ్లూ అంతంతమాత్రంగానే సూచీల కదలికలు

ముంబై, జూలై 3: రాబోయే మూడు సంవత్సరాలు మదుపరులకు ఈక్విటీ మార్కెట్లలో పెట్టిన పెట్టుబడులు ఆశించిన స్థాయిలో రాబడులను అందించకపోవచ్చని ఫ్రాంక్లిన్ టెంపుల్టన్ మ్యూచువల్ ఫండ్ (ఎంఎఫ్) చీఫ్ ఇన్వెస్ట్‌మెంట్ ఆఫీసర్ ఆర్ జానకిరామన్ అంచనా వేస్తున్నారు. గడిచిన మూడేండ్ల మాదిరిగా దేశీయ స్టాక్ మార్కెట్లు తదుపరి మూడేండ్లు పరుగులు పెట్టకపోవచ్చని బుధవారం ఇక్కడ జరిగిన ఓ కార్యక్రమానికి విచ్చేసిన ఆయన విలేఖరులతో మాట్లాడుతూ అభిప్రాయపడ్డారు. కానీ ఇతర పెట్టుబడి సాధనాలతో పోల్చితే మాత్రం ఈక్విటీ ఇన్వెస్ట్‌మెంట్స్ మెరుగ్గానే ఉంటాయన్నారు. అయితే అటు సెన్సెక్స్, ఇటు నిఫ్టీ ఆల్‌టైమ్ హైని తాకిన నేపథ్యంలో జానకిరామన్ అంచనా మిక్కిలి ప్రాధాన్యాన్ని సంతరించుకుంటున్నది.

లాభాల స్వీకరణ దిశగా..

ప్రస్తుతం మార్కెట్ వాల్యుయేషన్స్ అధికంగా ఉన్నాయన్న జానకిరామన్.. నిజానికి గత కొన్నేండ్లుగా ఆయా కంపెనీల ఆర్థిక ఫలితాలను మించి వాటి షేర్లు ట్రేడ్ అవుతున్నాయని చెప్పారు. అయితే ఇకపై మదుపరులు తమ పెట్టుబడులను తిరిగి తీసుకునే దిశగా అడుగులు వేయబోతున్నారన్నారు. సూచీలు జీవనకాల గరిష్ఠాల్లో ఉన్న వేళ లాభాల స్వీకరణకు ఇన్వెస్టర్లు పెద్దపీట వేస్తారని చెప్తున్నారు. కాగా, స్టాక్ మార్కెట్లలోకి పెద్ద ఎత్తున వస్తున్న ఇనీషియల్ పబ్లిక్ ఆఫర్ల (ఐపీవో) పైనా స్పందించారు. కొత్తగా లిస్టింగ్ అవుతున్న సంస్థలు అందివచ్చిన సొమ్మును తెలివిగా వాడుకోవాలని సూచించారు. ఇదిలా వుంటే ఓ మల్టీక్యాప్ కొత్త ఫండ్‌ను ఫ్రాంక్లిన్ టెంపుల్టన్ ఆఫర్ చేస్తున్నది. ఈ నెల 8న మొదలై.. 22న ముగుస్తుంది. ఒక్కో యూనిట్ రూ.10కి లభిస్తుంది.

రూ.445.43 లక్షల కోట్లకు..

బీఎస్ఈ నమోదిత కంపెనీల మార్కెట్ విలువ రికార్డు స్థాయిలో బుధవారం రూ.445.43 లక్షల కోట్లకు చేరింది. భారీ లాభాల నడుమ మదుపరుల సంపద రూ.4,45,43,642.29 కోట్లు (5.33 ట్రిలియన్ డాలర్లు)గా నమోదైంది. మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ 0.86 శాతం చొప్పున పెరిగాయి. రంగాలవారీగా బ్యాంకింగ్ షేర్లు 1.75 శాతం లాభపడ్డాయి. ఆర్థిక సేవలు, టెలీకమ్యూనికేషన్స్, సర్వీసెస్, ఇండస్ట్రియల్స్, ఎఫ్ఎంసీజీ సూచీలు 1.55 శాతం నుంచి 0.81 శాతం వరకు పుంజుకున్నాయి. అదానీ పోర్ట్స్ షేర్ విలువ అత్యధికంగా 2.49 శాతం పెరిగింది. కొటక్ మహీంద్రా, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్, ఇండస్ ఇండ్ బ్యాంక్, ఎస్బీఐ, పవర్‌గ్రిడ్ షేర్లు ఆకర్షణీయ లాభాలను అందుకున్నాయి.

తొలిసారి 80వేలకు సెన్సెక్స్

బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ మరో చారిత్రక స్థాయిని తాకింది. తొలిసారి 80,000 మార్కుపైకి వెళ్లింది. గరిష్ఠంగా 80,074.30 వద్దకు చేరింది. అయితే మదుపరుల అమ్మకాల ఒత్తిడితో రికార్డు స్థాయిని నిలుపుకోలేకపోయింది. అయినప్పటికీ 545.35 పాయింట్లు లేదా 0.69 శాతం ఎగిసి మునుపెన్నడూ లేనివిధంగా 79,986.80 వద్ద స్థిరపడింది. కాగా, కేవలం 3 నెలల్లోనే సూచీ ఏకంగా 5వేల పాయింట్లు పెరగడం గమనార్హం. ఇక నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ సైతం 162.65 పాయింట్లు లేదా 0.67 శాతం ఎగిసి మొదటిసారి 24,286.50 వద్ద నిలిచింది. ఒకానొక దశలోనైతే 24,307.25 వద్దకు వెళ్లి ఇంట్రా-డే హైని నెలకొల్పింది.

సెన్సెక్స్ హైలైట్స్

తేదీ	పాయింట్లు
07-02-2006	10,000
11-12-2007	20,000
26-04-2017	30,000
03-06-2019	40,000
03-02-2021	50,000
24-09-2021	60,000
11-12-2023	70,000
03-07-2024	**80,000**

స్టార్ హెల్త్ 'హోమ్ హెల్త్‌కేర్' సేవలు

చెన్నై, జూలై 3: స్టార్ హెల్త్ అండ్ అలైడ్ ఇన్సూరెన్స్ కంపెనీ.. ఇంటివద్దనే హెల్త్‌కేర్ సేవలు ప్రారంభించింది. కస్టమర్లకు ఇంటి వద్దనే ఆరోగ్యానికి సంబంధించిన సేవలు అందించాలనే ఉద్దేశంతో కేర్24, పోర్టీ, కాల్ హెల్త్, అతుల్య హోమ్‌కేర్, అర్గాల వంటి సంస్థలతో ఒప్పందాన్ని కుదుర్చుకున్నది. ఇంటి వద్దనే జ్వరం, గ్యాస్ట్రో సమస్యలు, మూత్ర నాళాల్లో ఇన్ఫెక్షన్ వంటి రోగులకు చికిత్స అందించనున్నారు. ఈ సేవలకోసం టోల్-ఫ్రీ నంబర్ 044-69006900 లేదా స్టార్ హెల్త్ మొబైల్ యాప్‌ను సంప్రదించాలని సూచించింది. ఇలా సంప్రదించిన వారికి వీలైనంత త్వరగా డాక్టర్ వారి దగ్గరికి వచ్చి చికిత్స చేయనున్నారు. ఐదు రోజులపాటు చికిత్స కోసం డాక్టర్ ఫీజుతోపాటు నర్స్‌కు అయ్యే రూ.7000-7,500 ఖర్చు ను సమ్ అస్యూర్డ్ కింద కట్ చేసుకోనున్నారు.

కూత కూయదిక

- ఆర్థిక సుడిగుండంలో చిక్కుకొని విలవిల
- నాలుగేండ్లకే మూతపడ్డ దేశీయ స్టార్టప్



- ఒక దశలో రోజువారి యాక్టివ్ కస్టమర్లు 21 లక్షల మంది.. నెలవారీగా కోటి మందికి తగ్గకుండా ఉన్నారు.
- సంస్థలో టైగర్ గ్లోబల్, ఏసల్, 3వన్4 క్యాపిటల్, కలారి క్యాపిటల్‌లు పెట్టుబడులు పెట్టాయి.
- హిందీ, తెలుగు, తమిళం, బెంగాలీ, గుజరాతీ, మరాఠి భాషల్లో సేవలు అందించింది.

న్యూఢిల్లీ, జూలై 3: దేశీయ సోషల్ మీడియా యాప్ 'కూ' మూతపడింది. ఎక్స్(గతంలో ట్విట్టర్)కు ప్రత్యామ్నాయంగా మారుతున్నదని నరేంద్ర మోదీ సర్కార్ ఊదరగొట్టిన ఈ స్టార్టప్ ప్రస్తుతం ఆర్థిక సుడిగుండంలో చిక్కుకొని విలవిలలాడుతున్నది. ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆర్థిక సహాయం అందకపోవడం వల్లనే ఈ స్టార్టప్ తన సేవలను మధ్యలోనే నిలిపివేసింది. కేంద్ర మంత్రులే స్వయంగా ఆత్మనిర్భర్ యాప్‌గా ప్రమోట్ చేసిన ఈ సంస్థ కేవలం నాలుగేండ్ల లోనే కాలగర్భంలో కలిసిపోయింది. అంతర్జాతీయ స్థాయి స్టార్టప్‌లను ఎదుర్కొవాలంటే వేలాది కోట్ల రూపాయల పెట్టుబడులు అవసరం..కానీ మోదీ సర్కార్ కేవలం ప్రమోట్ మాత్రమే చేసిందని, ఆర్థికంగా ఆదుకోలేదని విమర్శలు వస్తున్నాయి.

పెట్టుబడులకు గ్లోబల్ సంస్థలు వెనుకంజ

నిధుల కొరత తమకు అవరోధంగా మారిందని, దేశీయ యాప్‌ను నిలబెట్టేందుకు చేసిన ప్రయత్నాలేవీ ఫలించకపోవడంతో తన కార్యకలాపాలను నిలిపివేస్తున్నట్లు కంపెనీ వ్యవస్థాపకులు అప్రమేయ రాధాకృష్ణ, మయాంక్ బిదావాత్కా లింక్డిన్‌లో పోస్ట్‌చేశారు. ఇక నుంచి చిన్న యెల్లో బర్డ్ కనిపించదని పేర్కొన్నారు. గతేడాదిగా ఆర్థిక కష్టాలు చుట్టుముట్టినప్పటికీ నడిపించామని, అంతర్జాతీయ సంస్థలైన డైలీ హంట్ సహా వివిధ కంపెనీలతో విక్రయానికి చర్చలు జరిపినా అవేవీ సఫలీకృతం కాకపోవడంతో చివరికి ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఇరువురు ప్రకటించారు. అంతర్జాతీయ స్థాయిలో అమెరికన్లు డామినేట్ చేస్తున్నారని, భారత్ కూడా ఆ స్థాయికి చేరుకుంటుందని ఆశించినప్పటికీ ఫలితాలు వేరే విధంగా ఉన్నాయన్నారు. స్థానిక భాషలకు పెద్ద పీట వేస్తూ దేశీయ యాప్‌ను రూపొందించామని, ఓ దశలో 21 లక్షల రోజువారీ యాక్టివ్ యూజర్లను సంస్థ సొంతం చేసుకున్న విషయాన్ని ఇరువురు గుర్తుచేసుకున్నారు. రైతు ఉద్యమ సమయంలో అకౌంట్ల బ్లాకింగ్ వి